సాక్షి
చిత్తూరు

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



ప్రతి విద్యార్థి శాస్త్రవేత్త కావాలి

చిత్తూరు అగ్రికల్చర్ (పెనుమూరు) : ప్రతి విద్యార్థి శాస్త్రవేత్త కావాలని ఏరువాక కేంద్రం సమన్వయ కర్త శారదా జయలక్ష్మీదేవి అన్నారు.

II లో



పంటలపై గజ దాడులు

బంగారుపాళెం: శేషాపురంలో గురువారం రాత్రి పంటలపై ఏనుగులు దాడులు చేశాయి. వరి పంటను తొక్కివేశాయి. మామిడి తోటల్లో కొమ్మలను విరిచి, కాయలను నేలకూల్చాయి.

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	38	26
తిరుపతి	36	25
తిరుమల	33	22
గూడూరు	38	28
నగరి	39	27

సిలిండర్లకు బైబై..

ఇళ్లకు తాగునీరు, విద్యుత్ వచ్చిన రీతిలో గ్యాస్ కనెక్షన్ కూడా రానుంది. వంద గ్యాస్ ఏజెన్సీల ద్వారా జిల్లాకు సిలిండర్ల రూపంలో అందించే గ్యాస్‌ను పైప్‌లైన్ల ద్వారా ఇంటింటికీ అందించేందుకు గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా రంగం సిద్ధం చేసింది. పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. ఇళ్లకే కాదు.. వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు భూగర్భ పైపుల ద్వారా నేచురల్ గ్యాస్ పంపిణీ కానుంది.

- వేగంగా గ్యాప్ పైప్‌లు అమర్చే పనులు
- తొలి దశలో ఫిల్లింగ్ స్టేషన్లకు గ్యాస్
- మలిదశలో ఇంటింటికీ పైప్‌లైన్
- రూ.100 కోట్లతో తిరుపతి – తిరుత్తణి మధ్య పనులు
- రవాణా తగ్గడంతో తక్కువ ధరకే..



నగరి పట్టణంలో లోడ్ చేసి ఉంచిన గ్యాస్‌పైపులు

నగరి: ప్రజలకు గ్యాస్ కష్టాలు తీరనున్నాయి. సిలిండర్ బుక్ చేయడం..అది వచ్చేందుకు సమయం పట్టడం..ఈలోపు అవస్థలకు చెక్‌పడనుంది. గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా దేశవ్యాప్తంగా చేపట్టే పైప్డ్ నేచురల్ గ్యాస్ పనుల్లో భాగంగా రూ.వంద కోట్ల బడ్జెట్‌తో తిరుపతి– తిరుత్తణి మార్గంలో 75 కిలోమీటర్ల మేర గ్యాస్ పైప్‌లైన్ అమర్చుతున్నారు. ఏజీ అండ్ ప్రతమ్ కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో లేబర్ కాంట్రాక్టర్ల ద్వారా గ్యాస్ పైప్ లైన్ల పూడిక పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతోంది. తిరుపతిలో ప్రారంభమైన పైపుల పూడిక పనులు ప్రస్తుతం నగరిలో కొనసాగుతున్నాయి. సమీపంలోని తిరుత్తణికి చేరుకుంటే పూడిక పనులు పూర్తయినట్లే.

వంటగదికి సరఫరా ఇలా..

మెయిన్ సోర్స్ స్టేషన్ నుంచి గ్యాస్ సిటీ స్టేషన్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి జిల్లా రెగ్యులేటింగ్ స్టేషన్‌కు.. అక్కడి నుంచి ఇన్‌సైడ్ సొసైటీకి.. అక్కడి నుంచి నివాసాలకు సరఫరా అవుతుంది. నివాసాలకు వచ్చే గ్యాస్‌పైప్ లైన్ తొలుత మీటర్ రెగ్యులేటర్‌కు అనుసంధానమై తదుపరి వంటగదిలోని సా పైపునకు కలుపుతారు. వాడకాన్ని అనుసరించి బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది.

భద్రతా ప్రమాణాలు

పైప్‌లైన్ పనులు అత్యంత భద్రత ప్రమాణాలతో జరుగుతున్నాయి. ఈ పైపులను 1.7 మీటర్లు (సుమారు 6 అడుగుల) లోతులో అమర్చు తున్నారు. లీకేజీకి ఆస్కారం లేకుండా 16 ఇంచుల వ్యాసార్థం కలిగిన పటిష్టమైన 4 లేయర్‌ల వెల్డింగ్, 3 లేయర్ సేఫ్టీ ఉన్న పైప్‌లైన్లను ఈ ప్రక్రియకు వాడుతున్నారు. పైప్‌లైన్ మార్గంలో సూచికలను ఏర్పాటు చేస్తారు. ఇవి ఉన్న ప్రాంతంలో బోర్లు వేయడం, బావులు తవ్వడం, చెట్లు నాటడం నిషేధం. పైపులైన్లు జాతీయ రహదారి పక్కనే వెళుతున్నాయి.

ప్రమాదాలకు ఆస్కారం ఉండదు

అగ్ని ప్రమాదాలకు ఎలాంటి ఆస్కారం లేకుండా పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుంది. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి, పరీక్షల అనంతరం ఫిల్లింగ్ స్టేషన్‌కు గ్యాస్ వచ్చేందుకు ఏడాది సమయం పడుతుంది. ఆపై ఇళ్లకు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం లక్నోలో పైప్‌లైన్ గ్యాస్ సరఫరా ప్రక్రియ పూర్తయ్యాక ఇంటింటికీ సరఫరా చేస్తున్నాం.

– రిషబ్, క్వాలిటీ ఇంజినీర్, లక్నో

పరీక్షల తరువాతే సరఫరా

పైప్‌లైన్ ఏర్పాటు పూర్తయిన తరువాత తిరుపతి, తిరుత్తణి మార్గంలో రెండు ఫిల్లింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు. గ్యాస్ పైపుల్లో పంపే ముందు రెండు సార్లు నీటిని పంపి అల్ట్రా సోనిక్ టెస్ట్ చేస్తారు. పూర్తి స్థాయిలో పైప్ లీకేజీ లేదని నిర్ధారణ అయిన పిదపే గ్యాస్‌ను సరఫరా చేస్తారు. గ్యాస్‌తో నడిచే వాహనాలకు ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద సరఫరా చేస్తారు.

న్యూస్‌రీల్

పథకాల అమలులో ఆదర్శం



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

సాక్షి,చిత్తూరు: సంక్షేమ పథకాల అమలులో ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుని జిల్లాను ఆదర్శంగా నిలపాలని ఎంపీడీఓలకు జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ సూచించారు. శుక్రవారం జిల్లా సచివాలయ సమావేశం మందిరంలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డితో కలిసి సంక్షేమ శాఖల జిల్లాస్థాయి అధికారులు, ఎంపీడీఓలతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పథకాలు పారదర్శకంగా అమలు కావాలన్నారు. ఆర్థిక అంశాలతో సంబంధం లేని స్పందన వినతులను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. నాడు– నేడు పనులను వేసవి సెలవుల లోపు పూర్తి చేసేలా, తాగునీటి సమస్య తలెత్తకుండా, గృహ నిర్మాణాలు వేగవంతమయ్యేలా ఆయాశాఖల అధికారులతో సమన్వయంగా పనిచేస్తూ పురోగతి సాధించాలని సూచించారు.

గాలీవాన బీభత్సం



రామకుప్పం : నేలకూలిన విద్యుత్ స్తంభం

రామకుప్పం/కార్వేటినగరం: జిల్లాలో పలు మండలాల్లో శుక్రవారం గాలీవాన బీభత్సం సృష్టించింది. రామకుప్పం మండలం బూరుమాకులపల్లి, చెల్దిగానిపల్లె గ్రామాల్లో ఆరు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. పలు ఆవుల షెడ్ల రేకులు ధ్వంసమయ్యాయి. స్వీట్‌కార్న్, బంగాళదుంప, మిరప, సొర, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. కార్వేటినగరం మండలంలో కోదండారామపురం, సీడీకండ్రిగ పంచాయతీల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది.

బోయకొండలో పాడ్యమి పూజలు



చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం పాడ్యమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 10-30 నుంచి 12 గంటల వరకు రాహుకాల సమయంలో అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

అల్లా దయతో అంతా చల్లగుండాలి

సాక్షి నెట్‌వర్క్: రంజాన్ పండుగను ముస్లింలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఆకాంక్షించారు. రంజాన్ వేడుకల్లో హిందూ, ముస్లింల మధ్య సోదరభావం, ఆత్మీయత వెల్లివిరుస్తుందన్నారు. పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

– ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు.

– ముస్లింలు భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు నిర్వహించి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పండుగ జరుపుకోవాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి కోరారు.

– అల్లా కృపతో అందరికీ మంచి జరగాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆకాంక్షించారు.

క్లుప్తంగా

25న జంప్ రోప్ క్రీడా ఎంపికలు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని గంగనపల్లె క్యాంఫోర్డ్ పాఠశాలలో ఈనెల 25న జంప్‌రోప్ క్రీడా ఎంపికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పాఠశాల కరస్పాండెంట్ మహేశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో ఎంపికలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డుతో సంబంధిత తేదీలో పోటీలకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ఎంపిక చేసి మే 2,3 తేదీల్లో కర్నూలు జిల్లా ఆవనిగడ్డలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రోత్సహించాలని కోరారు.

బాలుడు అదృశ్యం


నిఖిల్ తేజ్(ఫైల్)

పలమనేరు: పట్టణానికి చెందిన నిఖిల్ తేజ్ (14) అనే విద్యార్థి రెండ్రోజులుగా కనిపించడం లేదని, సమాచారం తెలిసిన తమకు తెలియజేయాలని ఎస్ఐ సుబ్బారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు వెళ్లిన బాలుడు మళ్లీ ఇంటికి రాలేదని పేర్కొన్నారు. పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియక పోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భానుడి భగభగ

జిల్లాలో భానుడు సెగలు కక్కుతున్నాడు. మార్చిలోనే దంచికొట్టగా.. ఏప్రిల్‌లో మండే ఎండలు కాస్తున్నాయి. ప్రస్తుతం 41 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఉదయం నుంచే సూరీడు చెమటలు పట్టిస్తున్నాడు. ఫ్యాన్లు, ఏసీలకు విశ్రాంతి దొరకదంలేదు. మరికొన్ని రోజుల్లో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. తప్పనిసరైతే తప్ప.. ఎండల్లో బయటకు వెళ్లక పోవడం మంచిదని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

- మండుతున్న ఎండలు
- బయటకు అడుగుపెట్టాలంటే జంకుతున్న జనం
- నిర్మానుష్యంగా కనిపిస్తున్నరోడ్లు
- గరిష్ట ఉష్ణోగ్రత 41 డిగ్రీలు దాటుతున్న వైనం
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు

చిత్తూరు అర్బన్: భానుడి ధాటికి జిల్లా నిప్పుల కొలిమిలా తయారవుతోంది. మునుపెన్నడూ లేని విధంగా జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతనెల మొదట్లో జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 22, గరిష్టం 35 డిగ్రీలు ఉంటే.. తాజాగా గరిష్ట ఉష్ణోగ్రత 41 డిగ్రీలకు చేరుకుంది. ఉదయం 8 గంటల నుంచే ఉక్కపోత మొదలవుతోంది. నివాస ప్రాంతాలు, ఆఫీసుల్లో ఫ్యాన్లు, ఏసీలను 16 డిగ్రీల్లో ఉంచినా గది వాతావరణం ఆ స్థాయికి చేరుకునేందుకు గంటల సమయం పడుతోంది. ఉద్యోగాలకు వెళ్లేవాళ్లు, బస్సులు, రైళ్లల్లో ప్రయాణాలు చేసే వారు నీరసించి పడిపోయే పరిస్థితి నెలకొంది. ఎండలో తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే టోపీ, గొడుగు, ముఖానికి వస్త్రాలు, సన్ గ్లాసెస్ వేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చెమట ఎక్కువగా బయటకు వచ్చేస్తుంటే ఓఆర్ఎస్, ఎలక్ట్రో ద్రావణాలు రెండు గంటలకు ఒకసారి తీసుకోవాలని చెబుతున్నారు.

పశ్చిమ ప్రాంతాల్లో పరవాలేదు..

ఉష్ణోగ్రతల విషయంలో పలమనేరు మీదుగా పశ్చిమ ప్రాంతాల్లో వాతావరణం కొద్దిగా పర్వాలేదనిపిస్తోంది. పలమనేరు, పుంగనూరు, వి.కోట, బీ.కొత్తకోట, మదనపల్లె, కుప్పం, శాంతిపురంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఎండల తీవ్రత పెద్దగా లేదనే చెప్పాలి. ఇంట్లో ఫ్యాన్ వేసుకోకపోయినా ఉదయం నుంచి రాత్రి వరకు గది ఉష్ణోగ్రత 25 దాటడంలేదు.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

తేదీ	కనిష్టం	గరిష్టం
11	25	40
12	28	40
13	23	41
14	27	39
15	28	41
16	23	39
17	24	40
18	24	41
19	24	41
20	24	39
21	26	38



ఎండలో వెళ్లకూడదు



ఎండలు విపరీతంగా ఉన్నాయి. ఉదయం 9 గంటలకే తీవ్రత అధికంగా ఉంది. పనులను వీలైనంత త్వరగా ముగించుకుని ఎండ వేడి నుంచి దూరమవ్వాలి. చిన్న పిల్లలు, వృద్ధులు ఆరోగ్య విషయంలో పూర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తగిలితే సొంత వైద్యం వద్దు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వడ దెబ్బకు కావాల్సిన చికిత్స అందిస్తున్నారు. ప్రత్యేక వార్డు కలిపించాం. అన్ని రకాలు మందులు, మాత్రలు అందుబాటులో ఉన్నాయి.

– బీఎస్‌కే నాయక్, డీసీహెచ్ఎస్

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

గంగాధరనెల్లూరు: జీడీనెల్లూరు సమీపంలోని జైన్ ఫ్యాక్టరీ 2లో శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై కార్మికుడు మృతి చెందాడు. ఎస్ఐ రామాంజనేయులు కథనం..మండలంలోని అగరమంగళం గ్రామానికి చెందిన కన్నయ్య కుమారుడు ఇళయ రాజా(28) జైన్ ఫ్యాక్టరీ 2లో పనిచేస్తున్నాడు. పనిలో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారులు ధ్రువీకరించారు. కాగా ఆస్పత్రి ఎదుట మృతుని బంధువులు నిరసన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం తప్పిదం వల్లే ఇళయరాజా మృతి చెందాడని ఆరోపించారు. మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని యాజమాన్యం తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.పేర్కొన్నారు.


ఇళయరాజా (ఫైల్)

గూడ్స్‌పైకి ఎక్కి..

విద్యుత్ షాక్‌తో బాలుడికి గాయాలు


చికిత్స పొందుతున్న దినేష్

పుత్తూరు రూరల్: పుత్తూరు రైల్వే స్టేషన్‌లో గూడ్స్ పైకెక్కి ఓ బాలుడు విద్యుత్ షాక్‌కు గురై ఆసుపత్రి పాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ పరశురామ్ కథనం మేరకు.. రైల్వే స్టేషన్‌లో రెండవ ప్లాట్‌ఫామ్ నుంచి ఒకటో ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చేందుకు మధ్యలో ఆగి ఉన్న గూడ్స్ పైకి పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం గ్రామానికి చెందిన దినేష్(17) ఎక్కాడు. వెంటనే విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. దినేష్ తండ్రి జనార్దన్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

వడమాలపేట, నగరి, పుంగనూరు మండలాల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

వడమాలపేట : తిరుపతి– చెన్నై జాతీయ రహదారిపై వడమాలపేట మండలం పాదిరేడు బైపాస్ జంక్షన్ వద్ద శుక్రవారం ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రామాంజనేయులు కథనం మేరకు.. వడమాలపేట బైపాస్ నుంచి ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు ట్రాక్టర్ వెళుతోంది. ఇదే క్రమంలో ఎల్ఎంకండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన అంజేరయ్య (32) ద్విచక్రవాహనంపై వడమాలపేట నుంచి ఇంటికి వెళుతున్నాడు. పాదిరేడు బైపాస్ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొంది. ఈఘటనలో అంజేరయ్య ట్రాక్టర్ చక్రాలు కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు.

వాకింగ్ వెళ్లి..

నగరి : మున్సిపల్ పరిధి నెత్తం కండ్రిగకు చెందిన మునికృష్ణ (52) అనే వ్యక్తి శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సీఐ శ్రీని వాసంతి కథనం మేరకు.. మునికృష్ణ శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వాకింగ్‌కు బయలు దేరాడు. వాకింగ్‌కు వెళ్లి ఎంతకూ తిరిగి రాకపోవడంతో వెతుక్కుంటూ వెళ్లిన కుటుంబ సభ్యులకు రోడ్డు పక్కన విగతజీవిగా కనిపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘట స్థలానికి చేరుకున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్టు పోలీసులు గుర్తించారు.

కాలువలో పడి ద్విచక్ర వాహనదారుడు మృతి

పుంగనూరు: మండలంలోని భీమగానిపల్లె వద్ద శుక్రవారం హంద్రీ–నీవా కాలువలో పడి ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు నిమ్మనపల్లె మండలం రామాచార్లపల్లెకు చెందిన రాఘవేంద్ర (30) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వేకువజామున గుట్టపల్లెకి చెందిన మరో డ్రైవర్‌ను ద్విచక్ర వాహనంలో ఇంటి వద్ద వదిలి తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. అటుగా వెళుతున్న గ్రామస్తులు ఇది గమనించి దగ్గరికి వెళ్లి పరిశీలించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టమ్ నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు.

చిత్తూరు బులియన్



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,700
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79

కర్ణాటకలో వరసిద్ధుని కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కాణిపాకం(యాదమరి): కర్ణాటకలో శుక్రవారం రాత్రి కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చక, వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం కాణిపాకం నుంచి ఉత్సవ విగ్రహాలను ప్రచార రథంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజల అనంతరం కర్ణాటకలోని వీవీపురంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయానికి తీసుకెళ్లారు. అక్కడ రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవం నేత్ర పర్వంగా జరిగింది. ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ఎక్స్ అఫిషియో సభ్యుడు సోమశేఖర్ గురుకుల్, శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధిలో రూ 4.63 లక్షల అవినీతి

శాంతిపురం: ఉపాధి హామీ పనుల సమాజిక తనిఖీలో రూ 4,63,724 లక్షలు అవినీతి జరిగినట్లు తేలడంతో రికవరీకి ఆదేశించారు. గురువారం అర్ధరాత్రి వరకూ డ్వామా పీడీ గంగా భవాని ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ వేదికలో ఈ మేరకు వివరాలను వెల్లడించారు. ఉపాధి పనుల్లో రూ 1,86,424, పంచాయతీ రాజ్ పనుల్లో రూ 1,26,900, సర్వశిక్ష అభియాన్ ద్వారా రూ 1,50,400 దుర్వినియోగం జరిగినట్టు తనిఖీ బృందం తేల్చడంతో ఆయా మొత్తాన్ని రికవరీకి ఆదేశించారు. చెంగుబళ్ల పంచాయతీ పరిధిలో జరిగిన పనులపై సందేహాలు వ్యక్తం కావడంతో అక్కడ తదుపరి విచారణకు పీడీ ఆదేశించారు.

పూడు పాముల ముఠా అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న అటవీ అధికారులు

పలమనేరు: పూడు పాముల స్మగ్లింగ్ కేసులో మరో కీలకమైన ముగురు నిందితులను శుక్రవారం స్థానిక అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎఫ్ఆర్వో నయామ్అలీ వెల్లడించారు. గతనెల రెండున నమోదైన పూడు పాముల కేసులో పరారీలో ఉన్న మద్దిమాకులపల్లెకు చెందిన మురళిని గురువారం అరెస్ట్ చేశారు. అతన్ని విచారించగా స్మగ్లింగ్‌లో కీలకమైన కింగ్‌పిన్ ఎస్ఆర్‌పురం మండలం కొత్తపల్లె మిట్టకు చెందిన సుబ్రమణ్యం యాదవ్ అని తెలిసింది. ఈ సమాచారంతో నిందితుడిని అరెస్ట్ చేయగా, అతని సమాచారంతో మద్దిమాకులపల్లెకు చెందిన పూడు పాములు బలిష్టంగా తయారయ్యేందుకు ఆహారాన్ని అందించే ఆర్.శబరిని అరెస్ట్ చేశారు. ముగ్గురిపై ఫారెస్ట్ చట్టం కింద కేసు నమోదు చేసి, నేరానికి వాడిన ఓ వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులను శుక్రవారం స్థానిక కోర్టులో హాజరు పరిచారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్త కావాలి


సదస్సు ప్రారంభిస్తున్న అతిథులు

చిత్తూరు అగ్రికల్చర్ (పెనుమూరు): ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదిగి రైతులకు శాస్త్ర విజ్ఞాన ఫలాలను అందించాలని చిత్తూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం పెనుమూరులో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో తిరుపతి, అనంతపురం, మహానంది వ్యవసాయ విద్యార్థులు, రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఎన్నో ఆటుపోట్లు ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా విద్యార్థులు వ్యవసాయ విజ్ఞానం, ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చేలా కృషి చేయాలని తెలిపారు. తిరుపతి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో పంటలకు సుదూర ప్రాంతాల నుంచి గాలి ద్వారా తెగుళ్లు సోకే ప్రమాదం ఉందన్నారు. అలాంటి ప్రమాదాలను ఎదుర్కొనే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, మహానంది వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ కె.శివశంకర్, డాక్టర్ రవీంద్రరెడ్డి, డాక్టర్ సి.రమణ, డాక్టర్ రాఘవేంద్ర, మధురవాణి తదితరులు పాల్గొన్నారు.

మద్యం ధ్వంసం

పుత్తూరు రూరల్: పుత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న సారా, మద్యం బాటిళ్లను కార్యాలయం ఆవరణలో శుక్రవారం అధికారులు ధ్వంసం చేశారు. తిరుపతి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ ఇ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రూ.20 వేల బాటిళ్ల మద్యం ధ్వసం చేసినట్లు తెలిపారు.

దేశానికే ఆదర్శంగా పథకాలు

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శుక్రవారం టీఆర్ కండ్రిగ, ఇందిరానగర్ ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ ప్రాంతాల్లో మంత్రికి అపూర్వ స్వాగతం లభించింది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలను తెలుసుకున్నారు. సచివాలయ, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి సమస్యలకు పరిష్కార మార్గం చూపారు.

అమ్మా.. మీ మేలు మరువలేను

టీఆర్ కండ్రిగలో షుగర్ వ్యాధి కారణంగా ఒక కాలు కోల్పోయి మరో కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న దివ్యాంగురాలు అరుణను మంత్రి రోజా పలుకరించారు. ఆమె మాట్లాడుతూ తనకు షుగర్ వ్యాధి కారణంగా కాలుపోయిందని పింఛన్ ఇప్పించాలని గతంలో కోరగా, వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి మంజూరు చేయించారని, ప్రస్తుతం ఆ డబ్బులు ఆదరణగా నిలుస్తోందని, మీ మేలు మరువలేనని తెలిపారు. జైలాబ్దీన్, రమేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్లు గాయత్రి, బిలాల్, గోపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు హమీద్, దేశమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షుడు వేణు బాబు, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


వృద్ధునికి బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్కే రోజా

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించండి

- ఏనుగులు, అడివి జంతువుల దాడులను కట్టడి చేయండి
- నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని లాభదాయకంగా చేసి మరింతగా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో తమిళనాడు, ఇతర ప్రాంతాలలో వేరుశనగ విత్తన కాయలు కొనుగోలు చేయడం వల్ల కొంత నాణ్యత దెబ్బతినిందని తెలిపారు. ఈ ఏడాది అలా కాకుండా నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని తెలిపారు. అటవీ సమీప ప్రాంతాల్లో జంతువుల దాడులు చేయకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం టేబుల్ వెరైటీస్‌గా ఉంటున్న మామిడికి ఫ్రూట్ కవర్ ఇస్తారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మే నెలలో వేరుశనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, సభ్యులు సుధీర్ రెడ్డి, గోవర్దన్ బాబి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

లక్ష్యాలపై అవగాహన పెంచుకోండి

చిత్తూరు కలెక్టరేట్: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అధికారులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో 8 సూచికలకు సంబంధించి ఎస్‌డీజీ డాష్ బోర్డ్‌ని జీఎస్‌డబ్ల్యూఎస్ పోర్టల్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేసే విషయంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ వై.మేఘాస్వరూప్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ నాగ శైలజ పాల్గొన్నారు.

సంజాయిషీ ఇవ్వకుంటే క్రమశిక్షణ చర్యలు

షోకాజ్ నోటీసులు స్వీకరించిన సచివాలయ సిబ్బంది సంజాయిషీ ఇవ్వకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు.

నగ్న వీడియో అప్‌లోడ్‌చేసిన యువకుడి అరెస్ట్

చౌడేపల్లి: మహిళకు చెందిన నగ్న ఫొటోలు, వీడియో ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ మధుసూధనరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం సీఐ ఆ వివరాలు మీడియాతో తెలిపారు. మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ తెల్లనీళ్లపల్లెకు చెందిన 30 ఏళ్ల మహిళకు రామసముద్రం మండలం అరికెల పంచాయతీ గోసువారిపల్లెకు చెందిన ఎం.అంజనీకుమార్ రెడ్డి ఫేస్‌బుక్‌లో పరిచయమయ్యాడు. కొద్దిరోజుల తరువాత ఆమెకు చెందిన నగ్న ఫొటోలు, వీడియోలు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడంతో ఆ మహిళ చౌడేపల్లె ఎస్ఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అతన్ని అరెస్ట్‌చేసి పుంగనూరు కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించారని సీఐ వెల్లడించారు.


అరెస్టయిన అంజనీకుమార్‌రెడ్డి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	23	59,655
నిఫ్టీ	0	17,624

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	12,077	▲	20
డోజోన్స్	33,876	▲	8
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,914	▲	12
డాక్స్	15,882	▲	86
షాంఘై	3,301	▼	2
నికాయ్	28,564	▲	93

అమెరికా బ్రిటన్ జర్మనీ చైనా జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	60,191	▼	425
బంగారం (22 క్యారట్)	59,950	▼	423
వెండి (కిలో)	74,773	▼	646

రిలయన్స్ లాభాల రికార్డ్!

- క్యూ4లో నికర లాభం రూ. 19,299 కోట్లు
- కంపెనీ చరిత్రలోనే అత్యధికం
- రూ. 10 లక్షల కోట్లకు ఆదాయం

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో సరికొత్త రికార్డును సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 19,299 కోట్లను తాకింది. ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. అంతక్రితం ఏడాది(2021–22) క్యూ4లో రూ. 16,203 కోట్లు మాత్రమే ఆర్జించింది. రిటైల్, టెలికం విభాగాలతోపాటు చమురు, పెట్రోకెమికల్స్ బిజినెస్ వృద్ధి ఇందుకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2.14 లక్షల కోట్ల నుంచి రూ. 2.19 లక్షల కోట్లకు బలపడింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 66,702 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది కూడా సరికొత్త రికార్డుకాగా.. 2021–22లో రూ. కేవలం 60,705 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరింది. 2021–22లో రూ. 7.36 లక్షల కోట్ల ఆదాయం మాత్రమే అందుకుంది. పూర్తి ఏడాదికి ఆర్‌ఐఎల్ నిర్వహణ లాభం(ఇబిటా) తొలిసారి రూ. 1,54,691 కోట్లను తాకింది. ఇది 23 శాతం వృద్ధి. ఈ కాలంలో పెట్టుబడి వ్యయాలు రూ. 1,41,809 కోట్లుకాగా.. కంపెనీవద్దగల రూ. 1,93,282 కోట్ల నగదు బ్యాలెన్స్‌ను మినహాయిస్తే నికర రుణ భారం వార్షిక ఇబిటాకంటే తక్కువగా రూ. 1,10,218 కోట్లుగా నమోదైంది.

అన్ని విభాగాల జోరు: క్యూ4లో ఆర్‌ఐఎల్ ఇబిటా 22 శాతం జంప్‌చేసి రూ. 41,389 కోట్లను తాకింది. రిఫైనింగ్, పెట్రోకెమికల్స్(ఓటూసీ) ఇబిటా 14 శాతంపైగా ఎగసి రూ. 16,293 కోట్లకు, టెలికంసహా డిజిటల్ సర్వీసులు 17 శాతం మెరుగుపడి రూ. 12,767 కోట్లకు, రిటైల్ విభాగం 33 శాతం దూసుకెళ్లి రూ. 4,769 కోట్లకు, ఆయిల్, గ్యాస్ ఇబిటా రెట్టింపై రూ. 3,801 కోట్లకు చేరాయి. డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ లాభాలపై రూ. 711 కోట్లమేర ప్రభావం చూపినట్లు ఆర్‌ఐఎల్ పేర్కొంది. అంతక్రితం క్యూ4లో రూ. 1,898 కోట్లమేర ప్రభావం పడినట్లు ప్రస్తావించింది.

ఆర్‌ఐఎల్ షేరు స్వల్ప వృద్ధితో 2,351 వద్ద క్లోజైంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.



ఆర్థిక వృద్ధిలో భాగం

డిజిటల్ కనెక్టివిటీ, ఆర్గనైజ్‌డ్ రిటైల్ విభాగాలలో కంపెనీ కార్యకలాపాలు వ్యవస్థాగత సామర్థ్యాలకు బలాన్నిస్తున్నాయి. తద్వారా ప్రపంచంలోనే వేగవంత వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థలో భాగమవుతున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని విడదీసి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పేరుతో లిస్ట్ చేయనున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24)లో ఎంజే ఫీల్డ్, ఆర్‌క్లస్టర్ తదితరాలతో కలిపి కేజీ–డీ6 బ్లాకులో గ్యాస్ ఉత్పత్తి రోజుకి 3 కోట్ల ప్రామాణిక ఘనపుమీటర్లకు చేరే వీలుంది.

–ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఎండీ

రిలయన్స్ రిటైల్ భళా

గతేడాది(2022–23) క్యూ4(జనవరి–మార్చి)లో రిలయన్స్ రిటైల్ నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 2,415 కోట్లను తాకింది. 2021–22 క్యూ4లో రూ. 2,139 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 21 శాతం ఎగసి రూ. 61,559 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 50,834 కోట్ల అమ్మకాలు సాధించింది. ఆదాయంలో డిజిటల్, న్యూ కామర్స్ బిజినెస్ వాటా 17 శాతానికి చేరింది. ఇక మొత్తం స్టోర్ల సంఖ్య 18,040కు చేరింది. క్యూ4లో 2,844 స్టోర్లను జత చేసుకుంది. సర్వీసులతో కలిపి క్యూ4లో ఆదాయం రూ. 69,267 కోట్లను తాకగా.. ఇబిటా 33 శాతం వృద్ధితో రూ. 4,914 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మొత్తం ఆదాయం 32 శాతం జంప్‌చేసి రూ. 2,30,931 కోట్లను తాకింది. నికర లాభం 30 శాతం ఎగసి రూ. 9,181 కోట్లయ్యింది. సర్వీసులతో కలిపి స్థూల ఆదాయం రూ. 2,60,364 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిటైల్ రంగంలో రిలయన్స్ అత్యుత్తమ వృద్ధిని చూపుతున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈషా ఎం.అంబానీ పేర్కొన్నారు.

జియో లాభం జూమ్

క్యూ4లో రూ. 4,984 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్‌ఐఎల్ అనుబంధ సంస్థ, డిజిటల్ సర్వీసుల దిగ్గజం జియో ప్లాట్‌ఫామ్స్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 16 శాతం బలపడి రూ. 4,984 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) క్యూ4లో రూ. 4,313 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం పుంజుకుని రూ. 25,465 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 22,261 కోట్ల ఆదాయం నమోదైంది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 6.7 శాతం మెరుగై రూ. 178.8కు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 19,124 కోట్లయ్యింది. 2021–22లో రూ. 15,487 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 20 శాతం ఎగసి రూ. 1,15,099 కోట్లకు చేరింది. క్యూ4లో 2.9 కోట్లమంది జత కలవడంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 7 శాతం పెరిగి 43.93 కోట్లను తాకింది.

సింఫనీ బీఎల్‌డీసీ ఎయిర్‌కూలర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రపంచంలో తొలిసారిగా బ్రష్‌లెస్ డీసీ ఎలక్ట్రిక్ మోటార్ (బీఎల్‌డీసీ) టెక్నాలజీతో పనిచేసే ఎయిర్ కూలర్లను సింఫనీ భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సంప్రదాయ ఎయిర్‌కూలర్లతో పోలిస్తే ఇవి 60 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగిస్తాయని కంపెనీ వెల్లడించింది. 30, 55, 80 లీటర్ల సామర్థ్యంతో మూడు మోడళ్లను అందుబాటులోకి తెచ్చినట్టు సింఫనీ సీఎండీ అచల్ బకేరీ తెలిపారు.

తనిష్క్ నుంచి 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' చెవి రింగులు



హైదరాబాద్: టాటా గ్రూప్ కంపెనీ తనిష్క్, అక్షయ తృతీయ సందర్భంగా బంగారం, వజ్రాలతో తీర్చిదిద్దిన చెవి రింగులను 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' పేరిట విడుదల చేసింది. ఈ నూతన కలెక్షన్‌లో సంప్రదాయ ఝుంకీలు, ఆకర్షణీయ స్టడ్‌లు, డ్రాప్ ఇయర్ రింగ్స్ మరెన్నో ఉన్నాయి. వీటిని 18 క్యారెట్, 22 క్యారెట్లలో రూపొందించారు. పండుగ వేళ బంగారు ఆభరణాల మేకింగ్, డైమండ్ జ్యువెలరీ విలువపై 20% తగ్గింపు అందిస్తుంది. ఈ ఏప్రిల్ 24 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-4-2023	
విశాఖ	375–00
చిత్తూరు	418–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	365–00
విజయవాడ	365–00
రిటైల్ ధర (డజను)	60.00
21-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	358–00
వరంగల్	360–00
రిటైల్ ధర	4.20

సంపదలో 6 శాతం పుత్తడికి..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌తోపాటు చైనాకు చెందిన అల్ట్రా–హై నెట్ వర్త్ వ్యక్తులు (యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐ) గత సంవత్సరం పెట్టుబడి పెట్టదగిన సంపదలో 6 శాతం బంగారంలో ఉంచారని ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. '8 శాతం కేటాయింపులతో ఆస్ట్రేలియాకు చెందిన యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐలు తొలి స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా సగటు 3 శాతం కాగా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఇది 4 శాతంగా ఉంది. పెట్టుబడి పెట్టదగిన సంపదలో బంగారానికి భారతీయులు చేసిన కేటాయింపులు 2018లో 4 శాతం నమోదైంది. సంవత్సరాలుగా పుత్తడి అందించిన గణనీయమైన రాబడి ఈ పెరుగుదలకు కారణం. 2018–19 నుంచి 2022–23 మధ్య పసిడి 69 శాతం కంటే ఎక్కువగా రాబడిని అందించింది. మహమ్మారి తక్కువ వడ్డీ రేటుకు దారితీసింది. అంతర్జాతీయ కేంద్ర బ్యాంకులు అనుసరించిన సులభ నగదు లభ్యత వ్యూహం ధరలను భారీగా పెంచింది' అని నివేదిక వివరించింది. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో స్థిరత్వాన్ని అందించే, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా పనిచేసే సాధనాలను ఆశ్రయిస్తున్నారని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు.



హింద్ జింక్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 2,583 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి (క్యూ4)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 2,583 కోట్లకు పరిమితమైంది. పెరిగిన వ్యయాలు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2021–22) క్యూ4లో రూ. 2,928 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,074 కోట్ల నుంచి రూ. 8,863 కోట్లకు నీరసించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 10,511 కోట్లకు ఎగసింది.

సెన్సెక్స్ లాభం, నిఫ్టీ అక్కడే

- ట్రేడింగ్‌లో ఒడిదుడుకులు
- ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాలు

ముంబై: జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్ ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో స్టాక్ సూచీలు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. మిడ్ సెషన్ నుంచి మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు రాణించడంతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. ఉదయం సెన్సెక్స్ 94 పాయింట్ల నష్టంతో 59,538 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 369 పాయింట్ల పరిధిలో 59,413 వద్ద కనిష్టాన్ని, 59,781 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 23 పాయింట్లు పెరిగి 59,655 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16 పాయింట్ల లాభంతో 17,640 ప్రారంభమైంది. ఇంట్రాడేలో 17,554 – 17,663 వద్ద రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి ఎలాంటి లాభనష్టాలకు లోనవకుండా గురువారం ముగింపు 17,624 వద్దే స్థిరపడింది. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, మీడియా, ఫార్మా షేర్లకు రాణించాయి. మెటల్, ఆటో, ఫైనాన్స్, బ్యాంకింగ్, రియల్టీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.



సాక్షి స్పోర్ట్స్



ఆధిక్యంలో అర్జున్

సాటీ జుల్డిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో ఎనిమిది రౌండ్‌ల తర్వాత తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఏడు పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన నాలుగు గేముల్లో మూడింట గెలిచిన అర్జున్, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. వఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్), బిబిసారా (కజకిస్తాన్), బోరిస్ గెల్ఫాండ్ (ఇజ్రాయెల్)లపై నెగ్గిన అర్జున్ జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమెర్‌తో జరిగిన గేమ్‌ను 'డ్రా'గా ముగించాడు. 12 మంది అగ్రశ్రేణి ప్లేయర్ల మధ్య 11 రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. నేడు చివరి మూడు రౌండ్‌లు జరుగుతాయి.

'పారిస్' టికెట్ల కోసం 40 లక్షల మంది దరఖాస్తు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలను ప్రత్యక్షంగా తిలకించేందుకు రెండో దశలో 40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే నెలలో ఆన్‌లైన్ లాటరీ ద్వారా 13 లక్షల మందిని ఎంపిక చేస్తారు. తొలి దశలో 32 లక్షల టికెట్లు అమ్ముడుపోయాయి.

పసిడి పోరుకు జ్యోతి సురేఖ జోడీ

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–1 టోర్నీలో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు పతకం ఖరారైంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్ర ప్లేయర్ ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సురేఖ–ఓజస్ రెండో రౌండ్‌లో 159–157తో మరియా–గైల్స్ (లక్సెంబర్గ్)లపై... క్వార్టర్ ఫైనల్లో 159–156తో సోఫీ–అడ్రియన్ గోంటీర్ (ఫ్రాన్స్)లపై... సెమీఫైనల్లో 157–155తో ఫాతిన్ నూర్‌ఫతే–జువైది (మలేసియా)లపై గెలిచారు. నేడు జరిగే ఫైనల్లో చెన్ యి సువాన్–చెన్ చియె లున్ (చైనీస్ తైపీ)లతో జ్యోతి సురేఖ–ఓజస్ తలపడతారు. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మాత్రం అతాను దాస్–భజన్ కౌర్ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లో 3–5తో డెన్మార్క్ జోడీ చేతిలో ఓడిపోయింది.



జ్యోతి సురేఖ, ఓజస్ ప్రవీణ్

ధీరజ్ అద్భుతం...

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో ధీరజ్ 6–0తో థియో కార్బొనెటి (బెల్జియం)పై, రెండో రౌండ్‌లో 6–4తో కెజియా చాబిన్ (స్విట్జర్లాండ్)పై, మూడో రౌండ్‌లో 6–4తో జిగా రావ్నికర్ (స్లొవేనియా)పై, నాలుగో రౌండ్‌లో 6–5తో అమెరికా దిగ్గజం బ్రాడీ ఇలిసన్‌పై, క్వార్టర్ ఫైనల్లో 6–4తో తరుణ్‌దీప్ రాయ్ (భారత్)పై గెలుపొందాడు. ప్రపంచ మాజీ చాంపియన్, మూడు ఒలింపిక్ పతకాలు నెగ్గిన ఇలిసన్‌తో జరిగిన మ్యాచ్‌లో ధీరజ్ 'షూట్ ఆఫ్'లో గెలిచాడు. ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేసినా ధీరజ్ కొట్టిన బాణం 10 పాయింట్ల లక్ష్యబిందువుకు అతి సమీపంలో ఉండటంతో విజయం ఖరారు చేసుకున్నాడు.



మే 28న అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్



న్యూఢిల్లీ: ఐపీఎల్ 16వ సీజన్ ప్లే ఆఫ్ దశ షెడ్యూల్‌ను బీసీసీఐ శుక్రవారం ప్రకటించింది. మే 23న క్వాలిఫయర్–1 మ్యాచ్‌కు... మే 24న ఎలిమినేటర్ మ్యాచ్‌కు చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం వేదికగా నిలుస్తుంది. మే 26న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం క్వాలిఫయర్–2 మ్యాచ్‌కు, మే 28న ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

సందీప్ లమిచానె రికార్డు



కీర్తిపూర్ (నేపాల్): వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 100 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నేపాల్ స్పిన్నర్ సందీప్ లమిచానె రికార్డు నెలకొల్పాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రీమియర్ కప్ టోర్నీలో భాగంగా ఒమన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సందీప్ మూడు వికెట్లు తీశాడు. తద్వారా 42 మ్యాచ్‌ల్లోనే 100 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా సందీప్ నిలిచాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (44 మ్యాచ్‌లు) పేరిట ఉండేది.

సెమీస్‌లో బోపన్న జోడీ

బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–2, 6–4తో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)–ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.



చెన్నై చమక్...

బాధ్యత లేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ భంగపడింది. పటిష్టమైన బౌలింగ్, కట్టుదిట్టమైన ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన చెన్నై సూపర్ కింగ్స్ ... సులభమైన లక్ష్యాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా ఛేదించింది. జడేజా స్పిన్ మ్యాజిక్, కాన్వే విలువైన ఫిఫ్టీతో చెన్నై ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదు చేసింది.

- సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్లతో విజయం
- తిప్పేసిన జడేజా
- మెరిపించిన కాన్వే

చెన్నై: ఐపీఎల్‌లో చెన్నై దూకుడు పెరుగుతోంది. హైదరాబాద్‌ను బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ ఇలా అన్నిరంగాల్లో కట్టడి చేసిన సూపర్‌కింగ్స్ 7 వికెట్లతో జయభేరి మోగించింది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (26 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. చెన్నై బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా 3 వికెట్లు తీశాడు. అనంతరం సూపర్ కింగ్స్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (57 బంతుల్లో 77 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. మార్కండేకు 2 వికెట్లు దక్కాయి.

జడేజా మాయ...

హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను ఎక్కడికక్కడ చెన్నై బౌలర్లు కట్టడి చేశారు. పవర్ ప్లేలో ఓపెనర్ హ్యారీ బ్రూక్ (13 బంతుల్లో 18; 3 ఫోర్లు) బౌండరీలతో వేగం పెంచినా... అంతలోనే ఆకాశ్ సింగ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. తర్వాత హిట్టర్ రాహుల్ త్రిపాఠి (21 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్) ఆడినా, కెప్టెన్ మార్క్‌రమ్ (12 బంతుల్లో 12; 1 ఫోర్) బ్యాటింగ్‌కు దిగినా... క్లాసెన్ (16 బంతుల్లో 17; 1 ఫోర్) క్రీజులోకి వచ్చినా... నిలిచింది కాసేపే! ధాటైన ఇన్నింగ్స్, చితగ్గొట్టే ఓవర్ ఒక్కటైన కనిపించలేదు. ఉన్నంతలో అభిషేక్ శర్మ చేసిన స్కోరే కాస్త మెరుగనిపించింది. అనుభవజ్ఞుడైన స్పిన్నర్ జడేజా కీలకమైన అభిషేక్, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్ (2) వికెట్లతో సన్‌రైజర్స్ స్కోరు ఏమాత్రం పెరగకుండా అడ్డుకున్నాడు.

కాన్వే ధనాధన్...

చెన్నై ముందున్న సులువైన లక్ష్యాన్ని రుతురాజ్ గైక్వాడ్ (30 బంతుల్లో 35; 2 ఫోర్లు) బౌండరీతో మొదలుపెట్టాడు. డెవాన్ కాన్వే ధనాధన్ ఆటతో పరుగులు వేగంగా వచ్చాయి. మార్కో జాన్సెన్ వేసిన ఆరో ఓవర్‌ను కాన్వే అదేపనిగా దంచేశాడు. ఎదుర్కొన్న 5 బంతుల్ని 4, 4, 6, 4, 4లుగా బౌండరీలకు తరలించడంతో 23 పరుగులొచ్చాయి. దీంతో పవర్‌ప్లేలో చెన్నై స్కోరు 60/0. టార్గెట్‌లో అటుఇటుగా సగం పనైపోయింది. 11వ ఓవర్లో రుతురాజ్ రనౌట్ కావడంతో 87 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన అజింక్య రహానే (10 బంతుల్లో 9; 1 ఫోర్), ఇంపాక్ట్ ప్లేయర్ అంబటి రాయుడు (9 బంతుల్లో 9; 1 ఫోర్) విఫలమైనా కాన్వే అజేయంగా నిలబడి జట్టును గెలిపించాడు.



కాన్వే



జడేజా

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	5	3	2	6	0.192
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	5	3	2	6	-0.164
పంజాబ్	6	3	3	6	-0.298
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ x లక్నో (మ. గం. 3:30 నుంచి)
ముంబై x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (సి) రుతురాజ్ (బి) ఆకాశ్ 18; అభిషేక్ శర్మ (సి) రహానే (బి) జడేజా 34; రాహుల్ త్రిపాఠి (సి) ఆకాశ్ (బి) జడేజా 21; మార్క్‌రమ్ (సి) ధోని (బి) తీక్షణ 12; క్లాసెన్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 17; మయాంక్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 2; జాన్సెన్ (నాటౌట్) 17; సుందర్ (రనౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 134. వికెట్ల పతనం:** 1–35, 2–71, 3–84, 4–90, 5–95, 6–116, 7–134. **బౌలింగ్:** ఆకాశ్ 3-0-17-1, తుషార్ దేశ్‌పాండే 3-0-26-0, తీక్షణ 4-0-27-1, మొయిన్ అలీ 2-0-18-0, జడేజా 4-0-22-3, పతిరణ 4-0-22-1.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (రనౌట్) 35; కాన్వే (నాటౌట్) 77; రహానే (సి) మార్క్‌రమ్ (బి) మార్కండే 9; రాయుడు (బి) మార్కండే 9; అలీ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (18.4 ఓవర్లలో 3 వికెట్లకు) 138. వికెట్ల పతనం:** 1–87, 2–110, 3–122. **బౌలింగ్:** భువనేశ్వర్ 2-0-10-0, జాన్సెన్ 3-0-37-0, మార్క్‌రమ్ 1-0-11-0, సుందర్ 2.4-0-16-0, మార్కండే 4-0-23-2, ఉమ్రాన్ 3-0-18-0, డాగర్ 3-0-21-0.

సచిన్, కోహ్లి, రోహిత్‌ల 'బ్లూ టిక్' మార్క్ తొలగింపు

- ఈ జాబితాలో ధోని, సింధు, సైనా, సానియా, నిఖత్ జరీన్ తదితరులు
- డబ్బులు చెల్లిస్తేనే 'బ్లూ టిక్' సౌకర్యం కల్పిస్తున్న ట్విట్టర్



న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ నెట్‌వర్క్ సైట్ 'ట్విట్టర్' సెలబ్రిటీలకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తదితర తారల ట్విట్టర్ ఖాతాలకు 'బ్లూ టిక్' మార్క్‌లను తొలగించింది. ఈ మార్క్‌లు అధికారిక ఖాతా (వెరిఫైడ్ ఐడెంటిటీ) అనే ముద్ర కలిగి ఉంటాయి. ఇన్నాళ్లు సెలబ్రిటీలు, జర్నలిస్టులు, ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా 'బ్లూ టిక్' మార్క్‌లను కల్పించింది. అయితే ఈ మైక్రో బ్లాగ్ సైట్‌ను టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కొనుగోలు చేశాక నిబంధనలు మార్చారు. ఇందులో భాగంగా ఇకపై (ఏప్రిల్ 20 నుంచి) చెల్లింపు ఖాతాలకే 'బ్లూ టిక్' మార్క్‌లు కేటాయించాలని ట్విటర్ నిర్ణయించడంతో క్రీడా దిగ్గజాలు, సినీ తారలు 'బ్లూ టిక్'ను కోల్పోయారు. సచిన్, కోహ్లిలే కాదు... ధోని, రోహిత్ శర్మ, సైనా నెహ్వాల్, నీరజ్ చోప్రా, బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, బాక్సర్ నిఖత్ జరీన్, సానియా మీర్జా, సునీల్ ఛెత్రి, పీఆర్ శ్రీజేశ్, అంతర్జాతీయ దిగ్గజాలు ఫెడరర్, రాఫెల్ నాదల్ (టెన్నిస్), క్రిస్టియానో రొనాల్డో, ఎంబాపె (ఫుట్‌బాల్), ఖాతాలకు కూడా 'బ్లూ మార్క్'లు కనిపించవు.

ఏమిటీ 'బ్లూ టిక్'?



సచిన్ లేదంటే ఇంకే హీరో పేరు మీద ఇతరులు కూడా నకిలీ ఖాతాలు తెరుస్తారు. కానీ అసలైన సచిన్ టెండూల్కర్ ట్విట్టర్ ఖాతా ఏదంటే మాత్రం 'బ్లూ టిక్'తో వెరిఫైడ్ ఐడెంటిటీ తేలిపోతుంది. ఇప్పుడీ అధికారిక ముద్ర కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. వెరిఫైడ్ ఐడెంటిటీ కావాలంటే వెబ్ పోర్టల్‌కు రూ. 650, మొబైల్ ఫోన్లకు రూ. 900 ప్రతి నెలా చెల్లించాలి. 'బ్లూటిక్' మార్క్ తొలగించడంతో సచిన్ తన అధికారిక ఖాతాలో జాతీయ పతాకాన్ని పెట్టుకొని ఇదే నా 'బ్లూ టిక్ వెరిఫికేషన్' అని కామెంట్ జత చేశాడు.